క్లుప్తంగా

త్రీ టౌన్ పీఎస్ మరమ్మతులపై సీపీ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: శిథిలావస్థలో ఉన్న మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు మరమ్మతులు ఎప్పుడు చేస్తారనే నేపథ్యంలో 'క్షణక్షణం.. భయం భయం' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆరా తీశారు. తన దృష్టికి స్టేషన్ మరమ్మతుల విషయాన్ని ఎందుకు తీసుకురాలేదని త్రీ టౌన్ స్టేషన్ సిబ్బందికి కాల్ చేసి అడిగారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపట్టాలని సీపీ ఆదేశించారు.

ప్రమాదకరంగా డస్ట్ బిన్



బీచ్ రోడ్డులో ఇనుప ఊసలు విరిగి శిథిలమై పడి ఉన్న డస్ట్ బిన్

ఏయూక్యాంపస్: సాగరతీరంలోని నడక మార్గంలో ఉన్న డస్ట్‌బిన్ ప్రమాదకరంగా మారింది. ఆల్ ఎబిలిటీ పార్క్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఇనుప డస్ట్‌బిన్ శిథిలమైంది. ప్రస్తుతం దీనికి ఉన్న ఇనుప ఊచలు విరిగిపోయి పైకి కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఫుట్‌పాత్‌పై పరధ్యానంగా నడిస్తే ఇనుప ఊచలు గీసుకుని గాయాల పాలయ్యే అవకాశముంది. ఇప్పటికే శిథిలమై కింద పడిపోయిన డస్ట్‌బిన్‌ను తొలగించాలని వాకర్లు, సందర్శకులు కోరుతున్నారు.

రహదారులను ఆక్రమించి మొక్కల పెంపకం



ఎంవీపీలో ఇళ్ల ముందు రోడ్డును ఆక్రమించి పెంచుతున్న మొక్కల సముదాయం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–12లో పలు చోట్ల స్థానిక నివాసులు ఇంటి ముందున్న జీవీఎంసీ రోడ్లను ఆక్రమించి గ్రిల్స్ వేసి ఉద్యానవనాలను తీర్చిదిద్దుతున్నారు. ఇలాంటి కొందరి ప్రయత్నాన్ని చూసి మిగతా వారు కూడా జీవీఎంసీ రోడ్లను ఆక్రమించి మొక్కల సముదాయాలను పెంచుతున్నారు. దీంతో ఈ తరహా సంస్కృతి ప్రస్తుతం ఎంవీపీ కాలనీలో పెరుగుతోంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్త.. భరించలేని దుర్వాసన



శివాజీపాలెంలో రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెంలోకి మూడు రోజులుగా పారిశుధ్య కార్మికులు రాకపోవడంతో స్థానికులు రోడ్డు మీదే చెత్త వేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో నడిచి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందని పాదచారులు చెబుతున్నారు. చుట్టుపక్కల నివసిస్తున్న వారు కూడా చెత్త దుర్వాసన భరించలేక పోతున్నామని వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు స్పందించి రోడ్డు మీద పేరుకుపోయిన చెత్తను తక్షణం తొలగించాలని కోరుతున్నారు.

9న మెగా జాబ్ మేళా

పెందుర్తి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 250 కంపెనీల్లో కొలువుల కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని.. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పార్కు నుంచి రిజర్వాయర్ గట్టుపైకి శిథిలమైన మెట్ల మార్గం



పైకప్పు శిథిలమైన విశ్రాంతి షెల్టర్



బ్రిటిష్ అధికారులు బంగ్లాగా వినియోగించిన భవనం



ఏళ్లుగా పనిచేయని వాటర్ ఫౌంటెయిన్

మసకబారిన ముడసర్లోవ

ప్రతిష్టాత్మకమైన పార్కును పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

నగరంలో వందేళ్ల చరిత్ర.. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ముడసర్లోవ పార్కు గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. చుట్టూ పచ్చని కొండల నడుమ ఎంతో అందంగా ఉండే బ్రిటిష్ కాలం నాటి ఈ పార్కు పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురై మసకబారింది. ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరిన ఈ పార్కును పట్టించుకోకుండా వదిలేశారు. ఈ ఉద్యానవనంలో ఒకప్పుడు ఎన్నో సినిమా షూటింగ్‌లు జరిగాయి. నిత్యం సందర్శకులతో సందడిగా ఉండే ఈ పార్కు ఇప్పుడు వెలవెలబోతోంది. సుమారు పదేళ్ల నుంచి పాలకులు, అధికారులు ఈ పార్కుపై కపట ప్రేమ చూపిస్తున్నారు. దీన్ని సందర్శించిన అధికారులంతా ఇదుగో రూ.50 కోట్లు, అదుగో రూ.150 కోట్లతో అభివృద్ధి చేసేస్తామంటూ కల్లిబొల్లి కబుర్లు చెప్పి వెళ్లిపోయారే తప్పా... దీనికి కొత్తదనం తీసుకొచ్చే ఒక్క అధికారీ కనిపించలేదు. దీంతో సుమారు 12 ఏళ్లుగా ముడసర్లోవ పార్కు శిథిలాలకే పరిమితమైంది.

- ఆరిలోవ

- బ్రిటిష్ కాలం నాటి ఈ ఉద్యానవనంలో అన్నీ శిథిలం
- అస్తవ్యస్తంగా అలనాటి భవనాలు
- నిరుపయోగంగా వాటర్ ఫౌంటెయిన్లు
- అసౌకర్యాల నడుమ సందర్శకుల కార్యక్రమాలు
- ఆట పరికరాలు మూలకు చేరడంతో చిన్నారుల్లో నిరుత్సాహం
- పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు, సందర్శకుల విజ్ఞప్తి



పక్షులు లేని ఖాళీ గూళ్లు

పచ్చని కొండల నడుమ 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న ముడసర్లోవ పార్కులో ఒకప్పుడు సుందరంగా కనిపించే భవనాలు నేడు అస్తవ్యస్తంగా మారాయి. ఇవి గతంలో బ్రిటిష్ అధికారులకు, అతిథులకు విశ్రాంతినిచ్చేవి. ఇప్పుడు విష సర్పాలకు ఆవాసాలుగా మారాయి. ఇక్కడున్న భవనాలన్నీ శిథిలమవడం విశేషం. వీటిలో కొన్ని బ్రిటిష్ కాలంలో నిర్మించినవి. వీటిని నిర్మించి సుమారు 100 ఏళ్లకు పైగా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఈ భవనాలు ఎప్పుడు కూలిపోతాయోనని సందర్శకులు భయపడుతున్నారు. ప్రస్తుతం వీటిలో రెండు శిథిల భవనాలను జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు పంప్ హౌస్‌లుగా వినియోగిస్తున్నారు. పార్కు నిర్మించినప్పుడు ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్లు పూర్తిగా పాడయ్యాయి. ముడసర్లోవ పార్కు నుంచి రిజర్వాయర్ గట్టుపైకి వెళ్లే మెట్ల మార్గాలు శిథిలమయ్యాయి.

గొడౌన్‌గా జీవీఎంసీ అతిథి గృహం

ముడసర్లోవ పార్కులో 1991లో జీవీఎంసీ అతిథి గృహం నిర్మించింది. దీన్ని అప్పటి నగర మేయర్ డి.వి.సుబ్బారావు ప్రారంభించారు. నగరంలోని ప్రముఖులు, నగరానికి వచ్చిన ముఖ్యులు ఈ అతిథి గృహంలోనే బస చేసేవారు. ముఖ్యమైన నాయకుల అంతర్గత సమావేశాలు నిర్వహించేవారట. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు ఈ భవనం అతిథులు ఉండటానికి వీలుపడదు. దీని లోపల అంతా శిథిలావస్థకు చేరడంతో ముడసర్లోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది వారికి సంబంధించిన సామగ్రి, నీటి పైపులు వేసే గొడౌన్‌గా మార్చేశారు.

ఆనవాలు లేని స్విమ్మింగ్ పూల్

పార్కులోని సుమారు 1,000 చదరపు గజాల విస్తీర్ణంలో 1990లో స్విమ్మింగ్ పూల్ నిర్మించారు. అప్పట్లో సందర్శకులు, స్థానికులు దీనిలో ఈత కొడుతూ గంటల తరబడి గడిపేవారు. ఇప్పుడు దీనిలో ఏపుగా గడ్డి మొలిచి స్విమ్మింగ్ పూల్‌ను మూసేసింది. ఇటువైపు సందర్శకులు వెళ్లినా స్విమ్మింగ్ పూల్ ఉన్నట్లు ఆనవాలు కూడా కనిపించడంలేదు. దీన్ని ఆనుకొని మొసళ్ల కొలను ఉండేది. ఇప్పుడది పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కొలను పక్కనే ఉండే వాటర్ ఫౌంటెయిన్ కూడా శిథిలమై అస్తవ్యస్తంగా మారిపోయింది.



శిథిలమైన గోడతో సందర్శకులకు ఆహ్వానం పలుకుతున్న ముడసర్లోవ పార్కు



తుప్పు పట్టి విరిగిపోయిన ఆట పరికరాలు

కనుమరుగైన పక్షులు.. కానరాని సందడి

కార్తీక మాసంలో పిక్నిక్‌లు జరుపుకోడానికి నగరవాసులకు ముందుగా ముడసర్లోవ పార్కే గుర్తొస్తుంది. నగరవాసులు, కులాలు, సంఘాలు, యూనియన్లు, కుటుంబాలు ఇక్కడ సందడిగా వనభోజనాలు నిర్వహిస్తుంటారు. ఇది అందరికీ అందుబాటులో ఉండటంతో నిత్యం సందర్శకులతో కళకళలాడేది. సందర్శకులను అలరించడానికి పక్షుల గూళ్లు ఉండేవి. వివిధ రకాల పక్షులు అరుపులతో అలరించేవి. ఇప్పుడా సందడి కానరావడం లేదు. పక్షులు మాయమవడంతో వాటి గూళ్లు ఖాళీగా మిగిలాయి. ఇక్కడ విశాలమైన మైదానాలతోపాటు పిల్లల కోసం అనేక రకాల ఆట పరికరాలు అమర్చారు. ఇప్పుడవన్నీ తుప్పుపట్టిపోయాయి. దీంతో పిల్లలకు ఆటలాడలేని పరిస్థితి నెలకొంది. విశ్రాంతి షెల్టర్లు శిథిలమవడంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ముడసర్లోవ పార్కుకు పూర్వ వైభవం తేవాలని ఆరిలోవ ప్రాంత వాసులు, సందర్శకులు కోరుతున్నారు.

ముడసర్లోవ పార్కు విశేషాలు

- చుట్టూ పచ్చని కొండల నడుమ 20 ఎకరాల్లో ఈ పార్కు విస్తరించి ఉంది.
- బ్రిటిష్ కాలంలో భవనాలు నిర్మించి అతిథి గృహాలుగా వినియోగించేవారు.
- ఒకప్పుడు ఇక్కడ ఎన్నో సినిమా షూటింగ్స్‌ చేశారు.
- పార్కును ఆనుకుని అందమైన రిజర్వాయర్ ఉంది.
- మొసళ్ల కొలను, వాటర్ ఫౌంటెయిన్లు ప్రత్యేక ఆకర్షణగా ఉండేవి.
- విశాలమైన మైదానాలు ఈ పార్కు సొంతం.
- ఇక్కడ లెక్కలేనన్ని పెద్దలు, పిల్లల కార్యక్రమాలు జరిగాయి.

అధికారుల నిర్లక్ష్యం తగదు



ఎంతో ప్రశాంతతను ఇచ్చే ముడసర్లోవ పార్కుపై అధికారులు నిర్లక్ష్యం చూపడం తగదు. కొత్తగా ఎక్కడెక్కడో పార్కులు నిర్మిస్తున్నారు. ఇక్కడున్న విశాలమైన పార్కును అభివృద్ధి చేయకుండా వదిలేస్తున్నారు. ఈ పార్కును బ్రిటిష్ కాలంలో నిర్మించారు. దీనికి గొప్ప పేరుంది. ఇక్కడ ఎన్నో సినిమా షూటింగ్‌లు చేశారు. ఎక్కువగా చిరంజీవి సినిమా షూటింగ్‌లు జరిగాయి. అలాంటి పార్కును పట్టించుకోకుండా వదిలేయడం సరికాదు.

– ఒమ్మి పోలారావు, బాలాజీనగర్

పార్కును అభివృద్ధి చేయాలి



ముడసర్లోవ పార్కు ఎంతో పురాతనమైంది. దీని చుట్టూ విశాలమైన రోడ్లు, పచ్చని కొండలున్నాయి. దీని లోపలకు వెళ్తే ఎంతో ఆహ్లాదంగా ఉండేది. పార్కులో పిల్లల ఆటపరికాలు విరిగిపోయాయి. గతంలో ఉండే పక్షులు లేవు. ఈ పార్కు వల్ల ఆరిలోవ ప్రాంతానికి మంచి పేరు వచ్చింది. అధికారులు స్పందించి ఈ పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలి.

– కాకర గోవింద్, రామకృష్ణాపురం

కులగణనతో బీసీలకు ఎంతో మేలు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

ఎంవీపీకాలనీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా కులగణనకు ఆదేశించడం అత్యంత శుభపరిణామమని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. నగర పర్యటనలో ఉన్న ఆయన శనివారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీసీలతో పాటు వెనుబడిన సామాజిక వర్గాల హక్కులను మాజీ ప్రధాని నెహ్రూ హయాంలో కాంగ్రెస్ కాలరాసిందని ఆరోపించారు. పీఎం మోదీ నిర్ణయం దేశంలో వెనుకబడిన కులాలకు ఎంతో మేలు చేయనుందని తెలిపారు. బీసీల అభ్యున్నతికి ఆయన తొలి నుంచి పెద్దపీట వేశారన్నారు. రానున్న సెన్సస్ గణనలో ప్రతి కులం సామాజిక, ఆర్థిక పరిస్థితులను నమోదు చేస్తారని చెప్పారు. త్వరలో చేపట్టబోయే కులగణనకు బిహార్‌ను ఆదర్శంగా తీసుకోవాలే తప్ప.. తెలంగాణ రాష్ట్రాన్ని కాదన్నారు. పార్టీ నాయకులు మాధవ్, సుహాసిని, పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

అసాధ్యాలను సాకారం చేయడంలో మోదీ దిట్ట

అసాధ్యమనుకున్న ఎన్నో అంశాలను సుసాధ్యం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందని రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శనివారం ఓబీసీ యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన వన్ నేషన్ – వన్ ఎలక్షన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ఆర్టికల్ 370, త్రిపుల్ తలాక్ రద్దుతోపాటు మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం, వక్ఫ్ చట్టానికి సవరణలు ఇలా ఎన్నో అసాధ్యాలను మోదీ సుసాధ్యం చేశారన్నారు. వన్ నేషన్ – వన్ ఎలక్షన్ కూడా సాధ్యమయ్యే అవకాశముందన్నారు. ఇందుకు అవసరమైన కసరత్తు జరుగుతోందని చెప్పారు. ఈ విషయంలో ప్రాంతీయ పార్టీలకు, ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం సాహసోపేతం

మద్దిలపాలెం: సుదీర్ఘ కాలం తర్వాత దేశంలో కులగణన చేపట్టిన ప్రధాని నరేంద్ర మోదీ అభినవ జ్యోతిబా పూలే అని బీజేపీ బీసీ నేత మూల వెంకటరావు అభివర్ణించారు. నగరానికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌ను శనివారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో వెంకటరావు మాట్లాడుతూ కులగణన నిర్ణయం సాహసోపేతమైనదని పేర్కొన్నారు. దేశంలోని బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో మోదీ ప్రభుత్వం చేపట్టిన ప్రజోపయోగ కార్యక్రమమన్నారు. దేశంలోని బీసీలు దశాబ్దాల కాలంగా కులగణన కోసం ఎదురుచూస్తున్నారని, వారి కళ నేటికి నెరవేరిందని చెప్పారు. ఇంతటి సాహసోపేత నిర్ణయం తీసుకున్న పీఎం మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రమంతా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో డీఎస్సీ నిర్వహించాలి



మాట్లాడుతున్న నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్

సీతంపేట: డీఎస్సీ పరీక్షలను నెల రోజుల పాటు కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం వల్ల నిరుద్యోగులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రోజు ఒక్కో ప్రశ్నాపత్రం ఉండటం వల్ల కష్టమైన పేపర్ వచ్చిన వారు నష్టపోయే అవకాశం ఉందని, మొదటి రోజుల్లో పరీక్ష తేదీ వచ్చిన వారు మిగతా రోజులు ప్రిపరేషన్‌కు సమయం కోల్పోతారని అన్నారు. అందరికీ ఒకేరోజు ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని, డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, 2600 స్పెషల్ డీఎస్సీ పోస్టులను కూడా ప్రస్తుత డీఎస్సీతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్పెషల్ బీఈడీ, డైట్ చదివిన లక్ష మంది నిరుద్యోగులు స్పెషల్ డీఎస్సీ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఏఈఈ పోస్టుల భర్తీలో 30 శాతం ఏపీపీఎస్సీ ద్వారా, 70 శాతం ప్రమోషన్ల ద్వారా చేపట్టాలనే ప్రతిపాదనను వ్యతిరేకించారు. టీటీడీలో ఏఈఈ, ఏఈ, జేటీవో పోస్టులను రాత పరీక్ష ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సుధీర్, లక్ష్మణరావు, పురంధరి, అన్వేష్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు డ్రైవర్స్ కాలనీ షాదీఖానా భవనంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరం అందుబాటులోకి వచ్చింది. ఈ శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించి మాట్లాడారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో ఇక్కడ మహిళలకు 90 రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు రోజూ శిక్షణకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సీయూఆర్‌డీ కో ఆర్డినేటర్ కిశోర్‌కుమార్, ఏపీడీ శ్రీరామ్, సీవో అరుణ్‌కుమార్, స్థానిక నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ముగడ రాజారావు, రాగతి అచ్యుతరావు, మోది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏడాది వ్యవధి గల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైపెండ్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందిస్తామన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా, బీఎస్సీ, పారా మెడికల్, నర్సింగ్, ఎంఎల్టీ, బీపీటీ, కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు 79950 13421, 79950 13422 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైభవోపేతంగా శ్రీనివాస కల్యాణం



వేద పండితుల నేతృత్వంలో కల్యాణం జరిపిస్తున్న మొల్లి అప్పారావు, లక్ష్మి దంపతులు



వెంకన్న కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మద్దిలపాలెం: వైశాఖ మాస స్థిర వారం సందర్భంగా శనివారం సాయంత్రం జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ తూర్పు పరిశీలకుడు మొల్లి అప్పారావు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తితో కొలిచారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా వెంకన్న కల్యాణం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గోవింద నామస్మరణతో ఈ ప్రాంతమంతా మార్మోగింది.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌పై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న స్థానికులు

ఆరిలోవ: ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం ఆర్డీవో సంగీత్ మాదూర్ ఆధ్వర్యంలో శనివారం ఆరిలోవలో అవగాహన సదస్సు నిర్వహించారు. జీవీఎంసీ 9 నుంచి 13 వార్డుల పరిధిలో లబ్ధిదారులకు జీవో నంబర్ 30పై అవగాహన కల్పించారు. 2014 నుంచి 2019 మధ్యలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు ఇప్పుడు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. 150 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి సంబంధిత పత్రాలు తీసుకొని రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్, ఆయా వార్డుల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు పెద్ద సంఖ్యలో కోడెదూడల సమర్పణ



తొలిపావంచా వద్ద భక్తులు వదిలి వెళ్లిన కోడెదూడలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు కోడెదూడలు మొక్కుబడిగా చెల్లించారు. కొండదిగువ తొలిపావంచా వద్ద వాటిని స్వామికి సమర్పించి వదిలి వెళ్లారు. దాదాపు 150 వరకు కోడెదూడలను స్వామికి సమర్పించారు. కాగా వాటిని ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులకు పూచీకత్తుపై ఇచ్చేబాధ్యతను నగరానిగి చెందిన హోప్ యానిమల్ ట్రస్ట్ చేపట్టింది.